


# తలకాయ కూరతో బలే తలకాయనెప్పయినా...

'య్యో! మాబ్బాషా' అంటా కేకేసినాను రేకు తలుపు బయిట్నే నిలబడి.

'ఎవురా?' అన్నాడు మాబ్బాష (మహబూబ్ + బాష) లోపలి నుంచే.

'నేనూ కరీంభాయ్ కొ౦డుకుని. రేపూ తలకాయా కాళ్లూ కావాలంటా... మా నాయిన నీకు చెప్పేసి రమ్మన్నాడు' అన్నాను పెద్దగా.

కాస్త తాలినాక మాసిపోయిన ఎర్రటి సిల్కు లుంగీని పొట్టమీదకి కట్టుకుంటా బయిటికి వచ్చినాడు మాబ్బాష.

'తలకాయా కాళ్లకయితే అప్పులా. డబ్బులిస్తేనే యిస్తానని చెప్పు మీ నాయినకి' అన్నాడు డిమాండింగుగా.

'వాడమ్మా బడవా' అని మనసులో అనుకొని- 'అట్టాగే చెప్తానుగానీ నువు మాత్రం మర్చిపోయి యింకొకరికి యివ్వబాకా' అన్నాను, ఆణ్ణుంచి వచ్చేస్తా.

విష్ణాలయం వీదిలోని బంగారంగడిలో వారానికి ఆరు రోజులు కంసాలి పని చేసుకునే మాబ్బాషా ఆదివారం రోజు మాత్రం అర్కాటు నవాబుతో సమానం చుట్టుపక్కలోళ్లకి.

తక్కిన ఆరురోజుల్లా కాకుండా ఆదివారం రోజన్నా ఎగ్స్ట్రాగా నాలుగు డబ్బులు సంపాదిద్దామని చెప్పి (పాపం ఆ మనిషికి అందరూ ఆడ పిలకాయలే) పొట్టేల్ని కోసి చుట్టుపక్కల వీదిలోళ్లందరికీ మాంసం అమ్మతాడు మాబ్బాష.

ఆయన అమ్మే మాంసం కోసరం, ఆయన కోసే పొట్టేలు తలకాయ కోసరం శనివారం సాయింత్రం నుంచే ఆర్డర్లు, ఆదివారం పొద్దుటి నుంచే రెష్షూ మొదలయిపోతుంది మాబ్బాష యింట్లో.

మావూరి మార్కెట్టులో ఒకటికి ఆరు మాంసం అంగళ్లున్నా మాబ్బాష మాంసానికే ఎందుకంత డిమాండింగంటే అందుకు రెండు కారణాలున్నాయి.

ఒకటి: ఆదివారప్పూట అలివిగాని యాపారం జరగద్దీ కాబట్టి ఆ రోజున మార్కెట్టులో పొట్టేల్ని కోసి వేలాడదీస్తారో పొట్టేళ్ల మద్యన గొర్రెని వేలాడదీస్తారో నరమానవుడు కూడా కనిపెట్టలేడు. మాబ్బాషయితే మన కళ్ల ముందరే కోస్తాడుగదా. అదీ గ్యారంటీ.

రెండు: మాబ్బాషది అప్పు బేరం. అంటే ఎమ్మట్నే డబ్బులివ్వబల్లా. వారం గ్యాపులో, మళ్లా ఆదివారం వచ్చే లోపల ఎప్పుడైనా యివ్వవచ్చు. అయితే ఆ గ్యాపు నికరంగా వుండాలి. వారం లోపల డబ్బులు కట్టెయ్యకపోతే మరుసటి వారం నుంచి మాంసం కట్. తలకాయ కట్.

యీడ మాబ్బాష డిమాండింగు యిట్టా వుంది కదా... యింటి కాడ మా అమ్మ డిమాండింగు యింకో విదంగా వుంటుంది- తలకాయ కూరంటే.

'ఆ తలకాయనెప్పి కూర నేను వండలేనుగానీ యీ ఆదివారానికి మాంసమో, పొట్ట పేగులో తెచ్చుకుందాములే' అంటుంది మా అమ్మ- మా నాయిన కోరిక మీద కావాలని నీళ్లు పోస్తా. ఎందుకంటే మా అమ్మకి పొట్టపేగులంటే యిష్టం. మా నాయినకి తలకాయ కూరంటే ప్రాణం.

మా నాయిన ఊరుకోడు. తలకాయ కూర తినాలని ఎట్టా మనసులో పడిందికాబట్టి 'యీసారికిలా కానియ్యి అమ్మలాల. నీ మాదల్లో తలకాయకూరని వొండేవాళ్లు కావలి హోల్మొత్తంలో ఎవురూ లాకగానీ లాకుంటే నీ వెనక నేనెందుకు పడతాను బంగారా' అని మా అమ్మను పొగడతా మెల్లగా దోవలో పెట్టబోతాడు.

మా అమ్మ నీలుగుతుంది. 'నావల్ల కాదు నాయినా. నువ్వేమో లేవవు. పెద్దోడేమో వినడు. తెల్లారంగానే లేచి నేనుపోయి తెచ్చేదా తలకాయ?' అంటుంది.

'నీకదంతా బల్లేదుమే. తలకాయ తీసకొచ్చి చేరేసే పూచీ నాది. ఏమిరా?' అంటాడు మా నాయిన- నా తట్టు చూసి నువ్వు తీసకొస్తావు గదా అన్నట్టుగా.

'సినిమాకి డబ్బులిస్తే...' అంటాను నేను- కండీషను పెడతా.

'అట్నేపో' అంటాడు మా నాయిన.

సినిమాకి నేల డబ్బులు వస్తాయనిగానీ లాకుంటే తలకాయ కూరతో నిజ్జంగానే బలే తలకాయ నొప్పబ్బా. అసలికి తలకాయ కోసరం మాబ్బాషను చేరుకునేందుకే పెద్ద యుద్ధం చెయ్యాలి ముందు.

పొట్టేల్ని కోసి, మావుసాన్నంతా కువ్వబోసి, కేజీ అరకేజీ పావుకేజీ కువ్వలుగా ఆయన వైనం చేసుకుంటా వుండగానే మావుసం కోసరం వచ్చిన ఆడోళ్లంతా ఆత్రం పట్టలాక మాబ్బాష మీద పడిపోతారు 'మాకీ మాబ్బాషా మాకీ మాబ్బాషా' అంటా. ఎందుకంటే కోసేది ఒకటే పొట్టేలు. వచ్చేదేమో డబల్ మంది. అయిపోతే కష్టం కదా.

ఇనప రేకు మీద కువ్వలుగా పోసిన మావుసం తరిగే కొద్దీ ఆడోళ్లు గీబామని కేకలు పెంచేస్తా వుంటే, మనం వాళ్ల కాళ్ల సందన నుంచి దూరి, మాబ్బాషను గీరి, తలకాయా కాళ్లనీ సంపాదించుకోవాలి. వాటిని వైరుబుట్టలో వేసుకొని, నీళ్లు కార్చుకుంటా యింటికొచ్చే సరికి మా అమ్మ 'ముదురుగున్నట్టుంది కదా' అంటుంది తలకాయని చూసి- ఏదో ఒకటనాలి కదా అన్నట్టుగా.

'యాడ ముదురా! కొమ్ములు కూడా రాకపోతే' అంటాడు మా నాయిన మా అమ్మ మాటల్ని ఏ మాత్రం వాలనీయకుండా.

'పొట్టపేగులు తెచ్చుకొనుంటే డబ్బులు మిగిలుండేవి... యింత గడ్డు తలకాయ కోసరం మాబ్బాష ఎదాన ముప్పయి రూపాయలు పోసినారు. మీ అబ్బాకొడుకులదేం పోయింది... కానీండి. నాయినా... ముందర నువ్వు పోయి కాల్పించుకొని రాపో' అంటుంది మా అమ్మ నాతో.

యింకాణ్ణుంచి బుట్టెత్తుకొని ఎంకటేశ్వరా హాలుకాడ కొలిమి పనోళ్ల దగ్గరికి పోవాలి, తలకాయ కాళ్లని కాల్పించుకొని రావడానికి. అప్పటికే ఆడ కొలిమికిద్దరుంటారు నాబోటోళ్లు.

నేను వాడికీగా వెళ్లే కొలిమిలోని మొగుడూ పెళ్లాలు తలకాయని కాల్చే పద్ధతి బలే వుంటుంది చూడ్డానికి. మొగుడేమో నిప్పుల ముందర కూచొని, తలకాయకి సువ్వ గుచ్చి, దానిని అటూ ఇటూ కదపతా కాలస్తా వుంటే పెళ్లామేమో గాలిమిషను కాడ కూచొని గాలి

తిప్పుతా, మంటకి బొగ్గులందిస్తా వుంటుంది మొగాయనకి.

నిప్పుల సెగకి తలకాయ మీదుండే నూగు చిటచిటమని మాడతా వుంటే కొలిమి కొట్టం అంతా కమ్మటి వాసన. పొట్టేలు గుండెకాయని నిప్పుల్లో కాలిస్తే నోట్లో నీళ్లూరే వాసనొస్తుందే అట్టా వుంటుంది యీ వాసన కూడా. ఆ వాసన దెబ్బకి తట్టుకోలాక నల్లగా నిలుక్కుంటున్న తలకాయ చెవుల్ని అట్నే పెరుక్కొని తినేద్దామా అనిపిస్తుంది.

కొలిమి పని చేసే మొగుడూ పెళ్లాలు కూడా తలకాయ వాసనకు కమ్మగా మొకాలు పెట్టి శుద్ధంగా తలకాయనీ కాళ్లనీ కాల్చి నిప్పుల్లో నుంచి బయిట పడేస్తారు. మొగుడేమో ఒక సువ్వని ఎర్రగా కాల్చి, తలకాయకుండే ముక్కుల్లో చెవుల్లో సుయ్ సుయ్‌మని వాతలు పెడతాడు, లోపల ఏ పాడూ మిగలకుండా. పెళ్లామేమో కాళ్ల గిట్టెల మీద సుత్తి దెబ్బలేసి, గోర్లు ఎగరకొట్టి, గిట్టల సందున కూడా నీటుగా వాతలు పెడుతుంది. యీ మొత్తం పని పూర్తి చేసిచ్చినందుకు వాళ్లకి రెండు రూపాయలు చార్జీ.

ఈ పనైనాక కాల్చిన తలకాయని పగలగొట్టడం పెద్ద కళ.

ఆ కళ మా అమ్మకు రాదుగానీ మా పెదమ్మ మాత్రం ఘనాపాటి. మా పెదమ్మ తలకాయ పగలగొట్టిందంటే ఎంబ్రాయిడరీలో పువ్వు కుడతారే అంత నీటుగా వుంటుంది పని. మెదడు తీసి పక్కన పెట్టి, దవడెములు తీసి అవతల పారేసి, నాలిక మీద తెట్టు గీరేసుకొని, తక్కిన మావుసాన్నంతా కుదురుగ్గా ముక్కలు కొడుతుంది మా పెదమ్మ. అందుకనే మా అమ్మను తాకనీయకుండా, పోయి మా పెదమ్మను పిలచకొస్తాడు మా నాయిన.

మా నాయినంతటోడెళ్లి పిలిస్తే రాననడం బాగుండదు కాబట్టి గ్యారంటీగా వస్తుంది మా పెదమ్మ. రావడంతోటే మా సిమెంటు తొట్టె ముందర కూచొని తలకాయను ముందర పెట్టుకుంటుంది. యింక మా అమ్మొక తట్టు మా నాయినొక తట్టు చూస్తా వుండగా మొద్దుకత్తిని పట్టుకొన్న మా పెదమ్మ తలకాయని ముక్కలు కొడతా వుంటే, ఎర్రని నలుసులెగిరి మొకాన నోట్లోనూ పడతా వుంటాయి విసురుకి.

'పాడు పనమ్మో యిదా' అంటానే ఎట్నో పని ముగిస్తుంది మా పెదమ్మ.

అంతా అయినాక, నాలిక ముక్కలతో సహా మావుసం మొత్తాన్ని మా అమ్మొచ్చి దబర్లోకి ఎత్తుకుంటా 'కాసేపు ఉండరాదకా. కూర తీసుకొని పోదూగానీ' అంటుంది - మాట వరసకి.

మా పెదమ్మకు తెలుసు, పైకి మా అమ్మ అట్టా అంటుందిగానీ ముక్క కూడా కూర

పెట్టదని. 'నేను పోతానులే తల్లా. అంతగా పంపేటట్టయితే పిల్లోడి చేత యింటికి పంపు' అంటుంది ఎందుకైనా మంచిదని.

'అట్నేలే అకా. నేను పంపుతా పో' అంటుంది మా అమ్మ, అప్పటికప్పుడే ఆ మాటను మర్చిపోతా.

మా పెదమ్మ వెళ్లేంతదాకా వుండి, ఆమె వెళ్లినాక పొయ్యి మీద కూర దబర ఎక్కిస్తుంది మా అమ్మ. యింక చూడూ... నూరిన పచ్చి కొబ్బరి, టమేటాలు, లోంగా చెక్కా, అల్లం తెల్లగడ్డల మసాలా ఒక్కొక్కటీ పడతా వుంటే గమాగమా... ఘుమా ఘుమా.

ఆ వాసనలకి 'డడడా' అంటా రాగాలు తీస్తా, మధ్య మధ్యలో వచ్చి 'ముక్క ఉడికిందేమో చూసేదా?' అంటా వుంటాడు మా నాయిన. మా అమ్మ మా నాయిన్ను పట్టించుకోకుండా కూర మొత్తం వుడికినాక, ఉప్పు చూసుకొని, దబరను కిందకు దించి పెట్టి అదే చేత్తో బాండిలిని పొయ్యెక్కిస్తుంది. రొంత నూనె, రొంత మసాలా వేసి దోరగా బ్రెయిన్ని వేయించి దాన్ని కూడా మూడు నిమిషాల్లో కిందకి దించేస్తుంది.

ఇప్పుడు ఒక తట్టు తలకాయ కూర. యింకో తట్టు బ్రెయిన్ ఫ్రెయ్యి.

ఆ రెండింటినీ రెండు కళ్లతో చూసుకోంగానే మా అమ్మ ఒక్క నిమిషం కూడా ఆలిస్యం చేయకుండా 'పొద్దునంగా పొళ్లు తోమినానోని నాస్తా కూడా చేయకుండా యీ చాకిరీలో పడినాను. ఆకలేస్తుంది తల్లా' అంటా పళ్లెం అందుకుంటుంది, ఏదో ఒకటి గతిలాక తినాలి కదా అన్నట్టుగా యాక్షను చేస్తా.

'కాసేపు తాలేవాణ్ణోనీ అవతల మోటారు పని వుంది సామీ. అర్జెంటుగా వెళ్లిపోవాలి' అంటా యింకో పళ్లెం అందుకుంటాడు మా నాయిన, ఎట్టా తిన్నాక కమ్మగా నిదరపోతాడని మా అందరికీ తెలిసినా.

'ఆడ తిరిగి, యీడ తిరిగి బలే ఆకలిగా వుందిమా' అంటా నేను కూడా సందు చేసుకుంటాను.

'ఏదా... ఉప్పెట్టా ఉందో చూణ్ణీ' అంటా మా నాయినమ్మొస్తుంది. ఆనేక మా అన్న, మా చెల్లెలు, మా తమ్ముడు... లైను!

చేతికి జిడ్డు పట్టేంత కొవ్వుండే... అమృతం రుచితో నిండుండే... నలనల్లటి ముక్కలుండే... ఆ తలకాయ కూరని వేడి వేడి అన్నంలో కలుపుకొని, బ్రెయిన్ ఫ్రెయ్యి నంచుకొని, చేతికీ నోటికీ లాగిస్తా వుంటే అంతదాకా పడిన తలకాయ నొప్పి ఎగిరిపోయి ఆ పూట లోకం బలే సుబిక్షంగా వున్నట్టు అనిపిస్తుందబ్బా.

